
# పిడికెడు సానుభూతి




‘ఎక్కడినుంచే ఉత్తరం?’

ఉతికి ఆరేసిన చీర మడత పెడుతూ అడిగింది జానకి. ‘పోస్ట్!’ అన్న కేక వినీ వినగానే చెంగున వీధిలోకి పరుగెత్తిన శాంతిలో ఉత్తరం అందుకున్నాక మరి ఆ ఉత్సాహం లేదు. దాని ముఖంలో ప్రసన్నత మాయమయిపోయి ఎక్కడలేని చిరాకూ, అసహనమూ కనిపిస్తున్నాయి. అంటే, ఉత్తరం ఒంగోలు నుంచే వచ్చిందన్న మాట.

జానకి బాధగా ‘ఉస్సు’రని నిట్టూర్చింది. శాంతి రుసరుసలాడుతూ [illegible] తల్లి చేతి కిచ్చింది. జానకి ముఖం జేవురించుకుపోయింది. సూర్యం ఆ ఉత్తరంలో ఏం వ్రాస్తాడో తనకి బాగా తెలిసిందే. ఏడాదిగా వాడి నుంచి ఇలాంటి ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి. సూర్యం నుంచి వచ్చే ప్రతి ఉత్తరమూ ఇంట్లో కల్లోల వాతావరణాన్ని కల్పించి తీరుతుంది. అసలు ఒంగోలు నుంచి ఉత్తరమంటేనే చాలు, తన గుండె భయంతో దడదడలాడిపోతుంది.

నుదుటిమీద పట్టిన చిరుచెమటని కొంగుతో వత్తుకుంది జానకి. సులక [illegible] అనాసక్తంగా ఉత్తరం చింపి చదివింది.

“చెల్లెలు జానకిని ఆశీర్వదించి వ్రాయునది.

మా పరిస్థితి, మా దురదృష్టం చూసి నువ్వు మా మీద జాలి చూపిస్తావనీ, అర్థం చేసుకుంటావనీ ఇంత కాలం నుంచి ఎదురుచూస్తున్నాము. కాని, నీ సమ్మతి తెలియపరచటం లేదు. నువ్వు ఇష్టపడితే చిన్నపిల్ల, శాంతిని ఒప్పించడం కష్టమని నే ననుకోను. భగవంతుడు మమ్మల్ని అన్యాయం చేశాడు. శాంతి మీదే మా ఆశలు పెట్టుకున్నాం. ఇప్పుడు మా చెయ్యి క్రిందుగా, నీ చెయ్యి మీదుగా అయిందని కదూ నీ కింత లోకువగా కనిపిస్తున్నాం?

వర్షని తీసుకుని ఈ ఆదివారం నాడు విజయనగరం వస్తాను. వాడికి కూడా అక్కడికి రావాలనుందిట. నాకు వైజాగ్‌లో ఆఫీసు పని ఉంది. ఓ నాలుగు రోజులపాటు వా డక్కడే ఉంటాడు. ఈలోగా శాంతిని ఒప్పించే ప్రయత్నం చేస్తావు కదూ?

—నీ అన్న సూర్యం.”

జానకికి నరాలు తోడేసినట్లయింది. ఉత్తరంలోని వాక్యాలే ఆమె కళ్ళ ఎదుట వికృతరూపాలతో వికటాట్టహాసం చేస్తూ భయపెడుతున్నాయి. ఆమె కళ్ళు వర్షించటానికి సిద్ధంగా ఉన్న శ్రావణ మేఘాల్లా ఉన్నాయి.

‘ఏం రాశాడమ్మా మామయ్య? ఇంకా ఆ సోదేనా?’ విసుక్కుంటూ అడిగింది శాంతి. జానకి నిట్టూరుస్తూ, ‘అవునే... నీకు సోదిలాగే కనిపిస్తుంది. ఎటూ తెల్చుకోక నేను పడుతున్న వేదన ఆ పరమాత్మకే ఎరుక. సరేలే. మీ వర్ష బావని తీసుకుని వస్తున్నానని రాశాడు సూర్యం’ అంది.

త్రుళ్ళిపడింది శాంతి. ‘బావ వస్తున్నాడా!’ కంగారుగా అంది. ‘మామయ్య బావనికూడాఎందుకు తీసుకొస్తున్నాడు?’ శాంతి కేమీ పాలుపోవటం లేదు. జానకి ఉత్తరం శాంతి కిచ్చింది. ఆ ఉత్తరం చదివాక శాంతి శరీరం అసహ్యంతో, భయంతో కుంచించుకుపోసాగింది.

ఏం మనుషులు వీళ్ళు? తాము అనుకొన్న దానిని నెరవేర్చడంలో ఎంత పట్టుదల? ఎలా ఈ విపత్తుని ఎదుర్కోవటం? శాంతికి దుఃఖం వస్తోంది.

శాంతి కళ్ళలో సన్నటి జాలు కనిపించే సరికి జానకి మనసు జాలితో విలవిల లాడిపోయింది. ‘బావ వస్తాడంటే అంత బెదిరిపోతావేం, శాంతీ? తెలిసిన బావే కదా?’ శాంతి తొట్రుపాటుని చూసి

సముదాయించాలని చెపుతున్న తనకే అర్థ రహితంగా తోచి ఆగిపోయింది జానకి.

'బావేనమ్మా. బావగా వర్మంటే నాకెంతో జాలి, ఇష్టం. కాని, మీ రంతా బావని నా కిచ్చి పెళ్ళి చెయ్యాలని చూస్తున్నారు. నువ్వే చెప్పమ్మా, నిజంగా నీ కీ పెళ్ళి జరిగితే బాగుంటుందనిపిస్తూందా?' శాంతి వేసిన ప్రశ్న సూటిగా గుండెలో దూసుకుపోయినట్లయింది జానకికి. ఏం చెప్పగలదు తను? తన నోటితో తను శాంతి బ్రతుకు బుగ్గిపాలై పోయినా ఫరవాలేదని చెప్పగలదా? 'భగవాన్.' నిట్టూర్చింది జానకి.

భర్త పోయాక తమకు మిగిలిందల్లా రెండు వేల అప్పు. అదికూడా సూర్యం దగ్గరినుంచి తెచ్చినదే. పెద్దమ్మాయి రాధ పెళ్ళికి చేసిన అప్పు అది. సంబంధం కుదిరాక నిశ్చయతాంబూలాలు ఇచ్చుకుని పెళ్ళి సంగతి పై ఏడాది చూసుకుందామని నిబ్బరంగా ఉండిపోయారు తాము. కాని, పెళ్ళికొడుక్కి ట్రాన్స్‌ఫర్ అయిపోయి ఆంధ్ర ప్రాంతం వదిలి వెళ్ళిపోవలిసి వచ్చేసరికి వెంటనే పెళ్ళి జరిపించితీరాలని వాళ్ళు పట్టు బట్టారు. కట్నం డబ్బులు తప్ప, పెళ్ళిఖర్చులకి అప్పుడు తమ వద్ద ఒక్క పైసా లేదు. తమకి కాళ్ళూ, చేతులూ ఆడలేదు. అంత తక్కువ వ్యవధిలో డబ్బు ఎలా జతపరచాలో తెలియక ఆయన విలవిలలాడిపోయారు. చివరకు తనే ఎన్నో విధాలుగా నచ్చ చెప్పి పంపిస్తే సూర్యం దగ్గరికి వెళ్ళా రాయన. సూర్యం మంచి ప్రాక్టీసు ఉన్న లాయరు. బాగానే గడించాడు. మంచి ఇల్లుకూడా కట్టుకున్నాడు. అయితే మాత్రం? రెండు వేల రూపాయలు ఎవరు మాత్రం ఊరికే ఇస్తారు కనక? తన దగ్గర అంత లేదనీ, ఎవర్నో అడిగి తెచ్చాననీ, సాధ్యమయినంత తొందర్లో ఇచ్చెయ్యమనీ చెప్పి మరీ ఇచ్చాడు సూర్యం.

రాధ పెళ్ళి జరిగిన తరవాత సూర్యం బాకీ ఎలాగయినా తీర్చాలని ఆయన ఎంతో ప్రయత్నించారు. కాని, మామగారు జబ్బు చేసి పోవటం, రాధ, అల్లుడు పండుగలకీ వాటికీ వచ్చి వెళుతూండటం— వీటితో ఎప్పటికి దాచింది అలాగే ఖర్చయిపోతూనే ఉండేది. సూర్యం బాకీ తీరనే లేదు. రాధ చెప్పరానంత జబ్బుతో తీసుకుని, తమని అన్యాయం చేసి పోయింది. రాధ పోవటంతో తమ కష్టాలు రాను రాను అధికమయాయి. ఎన్నో ఇబ్బందులూ, చికాకులూ తమ సంసారాన్ని పీల్చి పిప్పి చేశాయి. రాధ పోయాక సూర్యం ఆ డబ్బు సంగతి ఎత్తడం మానేశాడు. అంతటితో తన కష్టాలు పూ[illegible]. భగవంతుడికి తన మీద ఇంకా ఎందు కింత కక్షో తెలియదు. రెండు రోజుల మాయదారి జ్వరం వచ్చి ఆయన్ని తీసుకుని పోయింది. తన బ్రతుకు చీకటి మయమయి పోయింది. వరసగా ఇన్ని దుర్ఘటనలు జరుగుతున్నా, తన గుండె ఎందుకు ఆగిపోదో తెలియదు. కాలం గడుస్తున్న కొద్దీ తను ఎదుర్కొన్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. శాంతిని చూసుకుంటూ ఇలా మోడువారిన జీవితాన్ని నెట్టుకొస్తూంది తను.

ఆయన పోయాక శాంతి బేసిక్ ట్రెయినింగులో చేరింది. అది ఉద్యోగం చెయ్యడం తన కిష్టం లేదు. దాని పెళ్ళి తన బతుక్కి ఒక పరిష్కారం కనిపించని సమస్య. శాంతి పెళ్ళి మాట తలుచుకున్నప్పుడల్లా తన మనసు బాధతో, భయంతో బరువెక్కిపోతూ ఉంటుంది.

భర్త పోయాక, చిన్న పిల్లలకి ట్యూషన్లు చెపుతూ, తెలిసిన వాళ్ళింట్లోనే వంటపని చేస్తూ ఎలాగో కాలం గుట్టుగా వెళ్ళబుచ్చుతూంది. శాంతి తన ఎదుటే చిరిగిన ఓణీలు వేసుకుంటూ తిరుగుతూ ఉంటే ఎంత దిగులుగా ఉంటుంది!

ఎంత చెప్పినా వినకుండా శాంతి ట్రెయినింగయాక వాళ్ళనీ వీళ్ళనీ పట్టుకుని అప్పర్ ప్రైమరీ స్కూల్లో టీచరుగా చేరింది. శాంతికి ఉద్యోగం దొరికాక తమ పరిస్థితి మరీ మునుపటంత అధ్వాన్నంగా లేదు. కాని, ఇలా ఎంత కాలం? శాంతి పెళ్ళి ఎప్పుడో ఒకప్పుడు జరిపించక తీరదు కదా?

శాంతి ఉద్యోగంలో చేరిన తరవాత ఒంగోలు నుంచి ఓ సారి సూర్యం వచ్చాడు. అప్పుడతను ఈ పెళ్ళి సంగతి ప్రస్తావించాడు. సూర్యానికి వర్మ ఒక్కడే కొడుకు. దురదృష్టవశాత్తు దీపావళికి మందుగుండు సామాను ఇంట్లో కట్టబోతూ ప్రమాదానికి లోనయ్యాడు. వాడి కళ్ళు రెండూ పోయాయి. ముఖం, చేతులూ బాగా కాలిపోయాయి. చచ్చి బ్రతికా డనుకోవాలి. అంతే. శాంతిని కోడలుగా చేసుకుంటే ముందు ముందు వర్మ సంరక్షణ—తెలిసిన పిల్లే కనక బాగా

## పంతుల జోగారావు

చేస్తుందని సూర్యం ఆశ. ఈ ఆలోచనతోనే అతను జానకిని ఒత్తిడి చేస్తున్నాడు. వర్మని చేసుకోవటం తన కిష్టం లేదని శాంతి స్పష్టంగా చెప్పిందికూడా. ఆ మాట కొస్తే తనకి మాత్రం ఇష్టం ఉందా? మేనల్లుడంటే జాలి ఉంది. అన్న పట్ల అభిమానం ఉంది. కాని, చేజేతులా శాంతి జీవితాన్ని ఎలా పాడు చేస్తుంది తను? కాని, సూర్యం పట్టు వదల లేదు. తను ఉత్తరాలు వ్రాయడమే కాకుండా, కావలసిన బంధువు లందరి చేత 'నువ్వు కాకపోతే వాడి నెవరు ఆదుకుంటా'రంటూ చెప్పిస్తున్నాడు కూడా. దీనితో తనకి మనశ్శాంతి లేకుండా పోయింది. కాలయాపన జరుగుతున్న కొద్దీ సూర్యం నుంచి ఒత్తిడి ఎక్కువవుతూంది. ఒకటి, రెండు ఉత్తరాలలో తమకి లోగడ డబ్బు ఇచ్చి సహాయం చేసిన సంగతికూడా సూచనప్రాయంగా కనిపించింది.

ఎడతెగని ఆలోచనలతో జానకి తల వేడెక్కిపోయింది. కళ్ళలో తిరిగిన నీళ్ళు శాంతి చూస్తుందేమోనని ఏదో పని ఉన్నట్టుగా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

శాంతి తల్లి కళ్ళలో నీళ్ళు చూడనే చూసింది. 'అమ్మా! ఏడుస్తున్నావా?' అనడిగింది ఉద్వేగంగా.

'లేదు, తల్లీ.'

'మరి. . . ఆ కన్నీళ్ళేమిటమ్మా? ఛీ! నువ్విలా బాధ పడటం నేను చూడలేనమ్మా. నువ్వే ఆలోచించమ్మా, మన దరిద్రం, కష్టాలు చూసి, అక్క పెళ్ళికి తను డబ్బిచ్చాడని చెప్పి, మన బలహీనతలని చూసి కదూ మామయ్య నన్ను వర్మ బావ కిచ్చి పెళ్ళి జరిపించాలని చూస్తున్నది? ఇలాంటి నీచపు ఆలోచనతో జరిగితే అదికూడా ఒక పెళ్ళే అవుతుందా! బావకి చూపు లేదు. చదువుకూడా అట్టే లేదు. కాని, మామయ్యకి ఆస్తి ఉంది. నన్నూ, బావనీ ఎల్లకాలం పోషించగలడు. కాని అమ్మా, వర్మ బావని జాలితోనో, డబ్బు ఇచ్చే సుఖాలకి ఆశించో పెళ్ళి చేసుకోవాలి కదూ! ఎంత దుర్భరం!' శాంతి గొంతు తీవ్రంగా వణుకుతూంది. జానకి దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చేసింది.

• • •

ఆదివారం.

పరీక్షల పేపర్లు ముందు వేసుకుని దిద్దుతూ కూర్చుంది శాంతి. ఆలోచనలు ఈగల్లా ముసురుతూ ఉంటే ఒక్క పేపరుకూడా దిద్దలేకపోయింది. ఆమె తలలో వర్మగురించే ఆలోచనలు గింగుర్లు కొడుతున్నాయి. మనసంతా చికాగ్గా ఉంది. బావా, మామయ్యా ఇంక వచ్చేస్తారు. బావని తను చిన్నప్పు డెప్పుడో చూసింది. ఎలా ఉంటాడో? అబ్బ! ఎలా ఉంటే నేం? అంధత్వం ఎంత భయంకరమయినది! పాపం, బావకి కళ్ళు పోవటం ఎంత దురదృష్టం! బావ జీవితం చీకటయిపోయింది. కాని, బావకి ఆసరాగా నిలబడి జీవితాంతం గుడ్డి భర్తతో గడపగలిగే ధైర్యం తనలో ఉందా? తనంత త్యాగం చెయ్యగలదా? అసలెందుకు చెయ్యాలి తను? బావకోసం తన జీవితంలో

## సుప్త సంక్రాంతి

### శనగన నరసింహస్వామి

నిరు డీ రోజున నీకు నగ్గలముగా నివ్వాళు లర్పించి సం
బరమున్ బొందిన తెల్గువారు పరమున్ వైముఖ్యమున్ బూని నీ
చరణాంభోరుహ మాపుర శ్రుతి సుఖస్వానంబు లాలింపగా
సరదా చూపగ బోవరేమి కతమో సంక్రాంతి! చింతింతువా?

ధర లాకాశము నంటె దుస్సహముగా దర్పించి రేయింబవల్
కొరుకన్ సాగెను సీతు వంగముల తత్ క్రూరత్వమున్ గెల్వగా
కరవై పోయెను దుప్పటుల్ సమిధలున్ కళ్యాణి! నానా వ్యథా
స్థిరతన్ దూలెడి జాతి నీ కెటుల ఆతిథ్యంబు కల్పించెడిన్?

ఆ యానందము నా మహోత్సవము నింకానాటి కేళీకళా
శ్రీయంబుల్ గనరావు పేదల ముఖశ్రీ వాడె యే యుద్ధరో
పోయిందేలుచు నీకు నేడు మధురాహ్వానంబు లంపించినన్
నీ యౌదార్యము అర్థమౌనె జగతిన్ నిర్నిద్ర శోభావతీ!

నిప్పు లెందుకు పోసుకోవాలి? అదీకాక తమ బలహీనతలను అసరాగా తీసుకుని వంచించబోవాలని చూసే మామయ్య ఆలోచనలో ఎంత క్రూరత్వం! కాని, మామయ్య లోని 'తండ్రి మనసు' ఇలా చేయిస్తూందేమో? అయితే మాత్రం? బావ పరిస్థితి మీద సానుభూతి చూపించమని వేధిస్తున్న వీళ్ళంతా కనీసం తన మీద ఒక పిడికెడు సానుభూతికూడా చూపించ రెందుచేత? తన ఆడ మనసుని అర్థం చేసుకో రెందుకు? అందరు ఆడపిల్లల్లాగే తనకీ ఆశలుండవా? తనేం నేరం చేసిందని? ఏ నిప్పులనోము చేసిందని ఈ శిక్ష అనుభవించాలి? శాంతి అసహనంగా నిట్టూర్చింది. వీధిలో బూట్ల చప్పుడు వినిపించి చూసింది తల ఎత్తి. నవ్వుతూ వచ్చాడు శ్రీనివాస్ 'శుభోదయం, శాంతారావ్‌గారూ!' అంటూ. ఆ సమయంలో శ్రీను రావటంతో మనసు కొంత తేలిక పడినట్లయింది శాంతికి. కృతకమైన కోపం అభినయిస్తూ, 'ఉదయాన్నే నీ దర్శనం అయిందిగా! ఇంకెక్కడి శుభోదయంలే? సరేకాని, ఆ పిలుపేమిటి? మరోసారి అలా పిలిచావంటే మరింక టాలరేట్ చేసేది లేదు. టేక్కేర్!' అంది తర్జని చూపిస్తూ.

శ్రీను గొంతు వినిపించి జానకి వసారాలోకి వచ్చింది. 'నమస్కారమండీ. మీ శాంతి చూశారా, చెట్టంత మనిషిని, నన్ను పట్టుకుని ఎలా ఊదర గొట్టేస్తూందో?' నవ్వుతూ ఆమెతో ఫిర్యాదు చేశాడు. జానకి నవ్వి ఊరుకుంది. పైకి నవ్వుతూనే ఉంది కాని, ఆవిడ ఆవేళ మనసంతా ఆందోళనతో నిండిపోయి ఉంది. సూర్యం, వర్మ వస్తారీ వేళ. సూర్యాని కేమని చెపుతుంది తను? ఇంట్లో ఎలాంటి ప్రళయం రాబోతూందో? జానకి మనసు భయంతో ఉడికిపోతూంది. కాఫీ కలిపి శ్రీనుకీ, శాంతికీ చెరో కప్పు ఇచ్చింది. వాళ్ళు కబుర్లలో పడ్డాక తన పని చూసుకుందుకు వంటింట్లోకి వెళ్ళిపోయింది.

శ్రీను తన కాలేజీ కబుర్లు హుషారుగా చెపుతున్నాడు. శాంతి ఆఫీసు భోగట్టాలు చెపుతూంది. వాళ్ళ సంభాషణ అలా ప్రవాహంలా సాగిపోయేదే... కాని, వీథిలో రిక్షా ఆగిన శబ్దం విని ఇద్దరూ ఆగిపోయారు.

శాంతి చటుక్కున లేచి నిలుచుంది. రిక్షాలోనుంచి ముందుగా మామయ్య దిగాడు. ఆ తరవాత చెయ్యి అందించి వర్మ బావని దించాడు. మామయ్య ఆసరాతో నడిచి వస్తున్నాడు వర్మ. అబ్బ. . . ఆ ముఖం కాలిన మచ్చలతో ఎంత వికారంగా కనిపిస్తూందో! శాంతికి ఒళ్ళు జలదరించుకుపోయింది. నల్ల కళ్ళజోడు వసారాలోకి వచ్చికూడా తియ్యలేదు వర్మ. ఆ కళ్ళు మరెంత భయంకరంగా ఉన్నాయో! టెరిలిన్ పాంటు, షర్టు వేసుకుని ఉన్నాడు. ఈ మనిషిని తను పెళ్ళి చేసుకుని త్యాగం చెయ్యాలా? ఎంత ఘోరం? శాంతి మనసే కాక, ఆమెలోని అణువణువూ తీవ్ర నిరసన భావంతో ఎదురు తిరుగుతూంది. అసహ్యంతో ఆమె శరీరం జలదరించుకుపోతూంది. ఛీ! ఏం మనుషులు! బావ మాత్రం? డిగ్రీ ఫస్ట్ ఇయరు వరకూ చదువుకున్నాడు కదూ? అమాత్రం జ్ఞానం లేదూ? ఛీ! మగాళ్ళంతా ఇంతేనేమో . . . తమ సుఖం కోసం వేటినీ ఖాతరు చెయ్యని తత్త్వం.

'బాగున్నావా, శాంతీ? ఏరా, వర్మా... ఇదిగో శాంతి.' శాంతి సభ్యతని పాటించకుండా ఉండలేకపోయింది. 'రా, మామయ్యా! ఏం బావా!' అని పలకరించింది.

వర్మ చిన్నగా నవ్వాడు. కాల్పుల వల్ల ఏర్పడిన తొర్రు—అది నవ్వడమో, హేళన చెయ్యడమో తెల్లియని విధంగా చేసింది. శాంతి మరి అటు వేపు చూడలేకపోయింది. ఈలోగా జానకి లోపలి నుంచి వచ్చి మేనల్లుణ్ణీ, అన్నయ్యనీ పలకరించింది. కుశల ప్రశ్నలు . వాయిగా వేసింది. వంటింట్లో ఇంతసేపూ ఎంతగా ఏడ్చిందో, ఆమె కళ్ళు ఎర్రగా ఉబ్బిపోయి నీళ్ళతో ఉన్నాయి. తొట్రుపాటుని దాచుకోలేక "ఉల్లిపాయలు వలుస్తూ వచ్చానర్రా. అబ్బ! కళ్ళు మండి పోతున్నాయి. ఉండండి, ఏస్తాను" అంటూ అర్థం లేని సంజాయిషీ ఇచ్చుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

'ఈ అబ్బాయి శీను కదూ? కిందటిసారి ఎప్పుడో చూశాను. మారిపోయాడు సుమా! ఏం చేస్తున్నావోయ్?' అనడిగాడు సూర్యం.

'బి. ఎస్‌సి. ఫైనలియరు చదువుతున్నానండీ.' జవాబిచ్చాడు శ్రీను. ఆ తరవాత శ్రీను వర్మతోనూ, సూర్యంతోనూ సరదాగా కలిసిపోయి మాట్లాడాడు. వర్మ కళ్ళు ఎలా పోయాయో తెలుసుకుని చాలా బాధ పడ్డాడు. శాంతి మొదటిసారిగా ఏం పలకరించిందో అంతే. మరి వర్మతో ఒక్క మాటయినా మాట్లాడలేదు. తను శ్రీనుతో కలివిడిగా మాట్లాడటం చూసి మామయ్య ఇష్టపడటం లేదని గ్రహించిన శాంతి, శీనుతో మరింతగా నవ్వుతూ మాట్లాడటం ప్రారంభించింది. వాళ్ళ సంభాషణ కట్ చెయ్యాలని సూర్యం ప్రయత్నిస్తున్న కొద్దీ మరింత మొండిగా శాంతి శ్రీనుతో మాట్లాడటం ప్రారంభించింది. వర్మ వాళ్ళ సంభాషణ వింటూ మౌనంగా ఎటో చూస్తూ కూర్చున్నాడు. సూర్యానికిది చాలా అవమానంగా తోచింది. ఆ సమయంలో తాను ప్రవర్తిస్తున్న తీరు మంచిదో కాదోకూడా ఆలోచించే సహనం శాంతిలో లేదు. ఇన్నాళ్ళుగా మామయ్య ఉత్తరాల ద్వారా, మనుషుల చేత తమని అంగీకరింపచేయటానికి చేసిన ప్రయత్నాల ద్వారా పెట్టిన మానసిక క్షోభకి ప్రతీకారం ఇలా తీర్చుకుంటున్నానన్న భావన తప్ప ఆమెలో మరేం లేదు. 'అందుకు శ్రీను ఎంత చక్కగా ఉపయోగపడుతున్నాడు!' అన్నదే ఆమె ఆలోచన.

జానకి శాంతి ప్రవర్తనని గమనించక పోలేదు. కాని, ఆ పిల్లను ఎలా మందలించాలోకూడా ఆమెకు తెలియటం లేదు. ఏం చెప్పినా సరే, ఈ శాంతి వినిపించుకునే స్థితిలోకూడా లేదనిపిస్తూంది. పాపం, శ్రీను కివేమీ తెలియవు. 'ఈ శాంతి వట్టి పిచ్చిపిల్ల. సంతోషం, దుఃఖం, కోపం, దయ—ఏదివచ్చినా సరే పట్టలేదు. అంతా ఉప్పెనే! తనకి సంతోషం వేస్తే గంటల తరబడి హస్కు కొట్టడమూ, కోపం వస్తే వారం రోజులపాటు మాటలు మానెయ్యడమూ—శాంతితో తనకి బాగానే అనుభవం. ఈ వేళ వాళ్ళ మామయ్య, బావ వచ్చిన సంతోషంతో పొంగిపోతున్నట్లుంది!' అని నవ్వుకున్నాడతను.

'అమ్మా, ఈ వేళ శ్రీను మనింట్లోనే భోజనం చేస్తాడు. . . ప్రస్తుతానికి వద్దని మొరాయిస్తున్నాడులే. తనని ఒప్పించే పూచీ నాది. రైటేనా?' అని వంటింట్లోకి కేక వేసింది శాంతి.

జానకి గుండె ఝల్లుమంది! శాంతి ఈ వేళ పిచ్చి పట్టినదానిలాగా ఇలా ప్రవర్తిస్తూందేం? భగవంతుడా! ఈ వేళ దీనికేం దయ్యం పట్టింది? జానకి గుండె దడదడ లాడి పోతూంది. శరీరంతా నిస్సత్తువ ఆవహిస్తూంది. 'అలాగే నమ్మా' అంది విధిలేక. సూర్యం అసహనంతో అస్పష్టంగా నిట్టూర్చాడు. వర్మకి ఒక తోడు చాలా అవసరం. ఆ తోడు భార్య అయి, అందులోకీ శాంతి లాటి దగ్గరి పిల్లయితే మరింత శ్రద్ధగా వాడికి జీవితంలో సంరక్షణ జరుగుతుందని కాదూ తనింతగా దేబిరిస్తున్నది! శాంతిని ఎలా వంచడం?

అందరూ భోజనాలకి లేచారు. జానకి అన్యమనస్కంగా వడ్డిస్తూంది. ఆమె మనసులో వెయ్యి దేవుళ్ళకి దండాలు పెట్టుకుంటూంది. శాంతి శ్రీనుకి కొసరి కొసరి వడ్డింపించింది తల్లిచేత. శ్రీను కూడా మొగమాటం లేకుండా నవ్వుతూ కబుర్లు చెపుతూ భోజనం చేశాడు. అప్పుడుకూడా శాంతి బావ ఉనికినే గుర్తించనట్లుగా ప్రవర్తించింది. భోజనం చేశాక ఓ అరగంట ఉండి శ్రీను వాళ్ళింటికి పోవాలని లేచాడు. శాంతి ససేమిరా అంగీకరించలేదు. జానకి వంటింట్లో కంచం ముందు కూర్చుని తినబోతే ఒక్క కడి గొంతు

## ఆనంద సంక్రాంతి!

**కె. వి. అప్పలాచార్యులు**

పసిడి నవ్వుల బరాబరులతో నింటింట
తొంగి చూచెను పచ్చతోరణమ్ము
సింగారముల పొంగి సిరుల చిందెను రంగ
వల్లి 'సముల్ల సత్ ప్రాంగణమ్ము
చలిరేయి జవరాలి సరసాల గమకించి
పొంగి పూచెను బంతిపూల వనము
తలిరాకుపై నిల్చి తెలిముత్యముల గెల్చి
మహి తాండవించెను తుహినకణము
వీకమై హెచ్చు హర్షాతిరేకమునను—
కొక్కొరోయని కాల్దువ్వె కుక్కుటమ్ము
విశ్వకల్యాణ దిగ్వీథి విడిది సేయ
కదలి రావమ్మ మకర సంక్రాంతి లక్ష్మి! *

దిగలేదు. మొహం కడిగేసుకుని, చక్కగా తయారై వసారాలోకి వచ్చింది.

అక్కడి నుంచి శాంతి శ్రీనుతో పాటే దిగింది. తల్లి రాగానే, 'చూడవమ్మా, నాటినీ షోకి రమ్మంటే శ్రీను ఎలా ఇబ్బంది పెడుతున్నాడో!' అంది జానకికి కత్తి గుండె తెగి, తన రక్తం చిమ్మిన మొహాన్ని చిమ్మి వెళ్ళిపోయింది.

'పోనీలే, శాంతి ఆ దిక్కుమాలిన సినిమాలకి వెళ్ళకపోతేనేం? మామయ్య, బావ వచ్చారుగా! ఇంట్లో ఉంటే ఏం?' అంది గొంతు పెగల్చుకుని.

శాంతి విసురుగా అంది: 'ఇంట్లోనా! బోర్. ఆదివారంకూడా ఇంట్లో పడి ఏడుస్తూ కూర్చోవాలా, అమ్మా! పోనీ, బావనికూడా పిక్చరుకి రమ్మందామంటే . . . బాడ్‌లక్' అంటూ ఆగిపోయింది.

'శాంతి, నోరుమూయ్!' అరిచింది జానకి.

'పోనీ, అత్తా, ఇప్పుడేమయింది కనక? నాకు ఒంటరిగా ఇంట్లో పొద్దు పుచ్చటం అలవాటయిందిలే. శాంతి అతనితోనే సినిమాకి వెళ్ళిరానీ.' నిటారుగా కుర్చీలో కూర్చుని ఎటు చూస్తున్నాడో తెలియకుండా అన్నాడు వర్మ. 'దయ చూపిస్తున్నాడు కాబోలు బావ!' వ్యంగ్యంగా అనుకుంది శాంతి తనలో.

శ్రీను వారించినా శాంతి వినలేదు. సూర్యం అగ్గి తొక్కినవాడిలా అయిపోయాడు. జానకిని పెరట్లోకి పిలిచి కేకలు వేశాడు. జానకి మాటలు మరిచిపోయిన మనిషిలా నిస్తత్తువగా ద్వారానికి ఆనుకుని కూలబడిపోయింది.

శాంతితో సినిమాకి బయలుదేరక తప్పిందికాదు శ్రీనుకి.

• • •

రాత్రి ఏడయింది.

శాంతి వచ్చి, గదిలో లైటు వేసింది. అంతవరకూ, ఒంటరిగా మంచం మీద కూర్చున్న వర్మ అలికిడి గుర్తించి, 'ఎవరూ, శాంతా?' అనడిగాడు.

శాంతి జవాబు చెప్పలేదు.

తను వచ్చినట్లుగా తల్లికి తెలియాలని కూనిరాగం తీస్తూ, అవీ ఇవీ సర్దుతూ చప్పుళ్ళు చేస్తోంది శాంతి. అమ్మకి తన మీద బాగా కోపం వచ్చినట్లుంది. పావుగంట గడిచినా ఇవతలికి రాలేదు. శాంతి చిన్నగా నవ్వుకుంది. ఆమె కిప్పుడు మన సెంతో తేలిగ్గా ఉంది. మామయ్య ఇంట్లో లేడు. వైజాగ్ వెళ్ళిపోయాడేమో?

'శాంతీ!'

బావ పిలుపు. వద్దనుకుంటూనే పలికింది శాంతి: ''ఊఁ...ఏం బావా?''

''నీతో కొంచెం మాట్లాడాలి. ఇలా రావూ?''

మనసు తీవ్రగతిని అభ్యంతరం చెప్తున్నా, బావ పిలుపులోని అభ్యర్థనని తిరస్కరించలేకపోయింది శాంతి. వెళ్ళి, అతనికి కొంచెం దూరంలో కుర్చీ వేసుకుని కూర్చుంది. ''చెప్పు బావా! ఏమిటి?''

''వచ్చావా, శాంతీ!'' అంటూ ఆగిపోయాడు వర్మ. కొంచెం సేపటి వరకూ ఏమీ మాట్లాడలేదు. మాటలకి వెదుక్కుంటున్నాడేమో? ఏం చెప్పబోతున్నాడు బావ? పెళ్ళి చేసుకుని జీవితాంతం తనకి సపర్యలు చెయ్యమనేనా? బావ కేమని చెప్పాలి? శాంతి మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది.

'శాంతీ, ఎంత మారిపోయావు! చిన్నప్పుడు ఒకసారి మనం కలిసిన పది రోజులూ ఎంత సరదాగా గడిపాం? దురదృష్టవశాత్తూ నా రెండు కళ్ళూ పోయాయి. నా రూపుకూడా భయంకరంగా, జుగుప్సాకరంగా తయారయిందిట కదూ? నీ కెంత అసహ్యం వేస్తోందో . . . నాతో కనీసం ఒక్క మాటకూడా మాట్లాడటం లేదు. చిన్నప్పటి శాంతిలా నాతో సరదాగా— పోనీ, ఇప్పటి నా స్థితి చూసి కనీసం జాలిగానయినా మాట్లాడతావని ఎంత ఆశ పడి వచ్చానో తెలుసా? దయకీ, సానుభూతికీ వాచిపోతున్నాను, శాంతీ. . . చెప్పు, నే నంటే అసహ్యం వేస్తోంది కదూ?' వర్మ గొంతు దుఃఖంలో వణుకుతూంది. ఏం చెప్ప గలదు తను?

శాంతిలో బింకం అంతా కరిగిపోయింది. ఎంతయినా తన బావ అతను! అత నలా మాట్లాడుతూ ఉంటే కన్నీరు ఆగింది కాదు. నిశ్శబ్దంగా కన్నీరు కార్చింది.

అంతులేని వేదనతో, తీరని అవమానంతో ఆ గుండె ఎంత బరువైపోయిందో! ఛీ! తనెంత మూర్ఖంగా ప్రవర్తించిందీవేళ! తన కళ్ళు ఎందు కిలా మూసుకుపోయాయి? ఎంత అంధురాలయిపోయింది తను!

'శాంతీ! శ్రీను అత నెలా ఉంటాడు?' వర్మ గొంతులో ఎలాంటి తీవ్రతా లేదు. ఎలాంటి ఉద్వేగాలకీ అతను లోనవుతున్నట్లుగా లేదు. ఆ స్వరం ప్రశాంతంగా ఉంది.

శాంతి మాట్లాడలేకపోయింది.

'శ్రీను బాగుంటాడు కదూ, శాంతీ! ఎంత చక్కగా నవ్విస్తూ మాట్లాడతాడతను! శ్రీనుని ప్రేమిస్తున్నావు కదూ, శాంతీ? నేను పొరపాటు పడటం లేదనుకుంటాను? అతన్ని పెళ్ళిచేసుకో, శాంతీ. మా నాన్న—నీకు తెలుసో తెలియకో కాని నిన్ను నా కిచ్చి పెళ్ళి చేయాలని చాలా ప్రయత్నాలు చేస్తున్నాడు. నా కిష్టం లేదు. శాంతీ, నా సుఖం కోసం నీ జీవితం పాడు చెయ్యలేననిపించింది. నాన్న పట్టుదల నీకు తెలుసు కదూ? అతను తెచ్చే ఒత్తిడికి నువ్వెక్కడ గత్యంతరం లేక పెళ్ళికి అంగీకరిస్తావో నని హడిలిపోయాను, శాంతీ, అందుకే వద్దని నీకు చెప్పాలనిపించింది. ఉత్తరం వ్రాయడం నా కెలా సాధ్యమవుతుంది, శాంతీ! అందుకే ఒకసారి విజయనగరం రావాలనుందని నాన్నని అడిగాను. నాన్న మరోలా అర్థం చేసుకుని నన్నిక్కడికి తీసుకొచ్చారు. వద్దు, శాంతీ... మా నాన్న మూర్ఖత్వానికి నువ్వు బలి కావటానికి వీల్లేదు. నువ్వు సుఖంగా ఉండాలి, శాంతీ.' అతని కళ్ళు వర్షిస్తున్నాయి.

శాంతి బాధతో వణికిపోయింది. ''క్షమించు, బావా. . . నువ్వు. . . నువ్వెంతో గొప్ప వ్యక్తివి. నిన్నర్థం చేసుకోలేకపోయాను. ఎంత నీచంగా నిన్ను భావించాను! ఈ వేళ నీ పట్ల నా ప్రవర్తన నాకే వెగటు కలిగిస్తోంది. బావా. . . నిన్ను. . . నిన్ను పెళ్ళి చేసుకోలేను. నా జీవితం పాడవుతుందని కాదు . . .నీ ఎత్తుకి ఎదగలేక. . . ఈ వేళ నీ ప్రవర్తనతో నాలో కలిగించిన ఈ ఔన్నత్యం భద్రంగా కాపాడుకోగలననే నమ్మకం నాకు లేదు, బావా. . . అందుకే నిన్ను పెళ్ళి చేసుకోలేను. . . నేను శ్రీనుని ప్రేమించటం లేదు, బావా. . . చిన్నప్పటినుంచి తెలిసిన ఒక మంచి స్నేహితు డతను. . . అంతే. పెళ్ళి చేసుకోవటం మానెయ్యను. ఎవరినో ఒకరిని పెళ్ళాడతాను. . . కానీ, బావా, లోకంలో దైన్యం రకరకాలుగా ఉంది. దీనులని దయతో చూడాలన్న విజ్ఞానాన్ని ఈ వేళ నేర్చుకున్నాను. . . ఇది నా జీవితంలో మరిచిపోను. . . నన్ను క్షమించవూ?'' అంటూ ఎంతో చెప్పాలనిపించింది ఆమెకి. కాని, ఒక్క ముక్క ఆమె గొంతు దాటి బయటకు రాలేదు.

వెక్కి వెక్కి ఏడుస్తూ చేతుల్లో ముఖం దాచేసుకుంది. ★

## కోల్పోయిన ముఖం

### గుంటూరు శేషేంద్ర శర్మ

హేమంత చంద్రుడు ఏడ్చి ఏడ్చి కృశించాడు
చుక్కలు గోడల్లో నిద్రిస్తున్నాయి
పిచ్చి గాంధర్వ్యం కూడా ఆవులిస్తున్నాయి
చిన్న నక్షత్రం చేతో పట్టుకుని
అంతరాత్మ సందుల్లో ఒక రహస్యం
వెతుక్కుతున్నాను
ఎన్నో కోట్ల రాత్రుల పొరల క్రింద బయట పడింది
మనిషి కోల్పోయిన ముఖం!
వెయ్యి కిరణాలతో —
నే నన్నాను...
మా నరనరాల్లో రక్తమై ప్రవహిస్తున్న
నీ కాంతి మండలం
నిద్రిస్తున్నా అగదు — పద
మా ఉదయరేఖా శిఖరాలు అధిరోహించు
ఈ లోకం మనదే
మనిద్దరం ఒకే ఎర్ర తామర పువ్వు పంచుకుందాం..
పేతితో నక్షత్రం చెట్ల కొమ్మల్లోకి ఎగిరిపోయింది
పిచ్చి గాంధర్వంలో జ్వాలలు పేగుల్లోకి దూకాయి
చుక్కలు నిద్రలేచి కళ్ళు కూండోకాయి
చంద్రుడు ఆకాశం దిగి కిందికి దూకి
అందరికీ వెన్నెల పంచిపెట్టాడు ★